ప్రజాశక్తి
మంగళవారం 23 జనవరి 2024
5
విజయనగరం



సామాజిక సమతుల్యత సాధనకే కులగణన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమాజంలోని వివిధ వర్గాల స్థితిగతులను తెలుసుకొని, వారి జనాభా ప్రాతిపదికగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అందించాలన్న గొప్ప లక్ష్యంతో రాష్ట్రంలో కులగణనను ప్రభుత్వం చేపడుతోందని జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సామాజిక సమతుల్యత సాధించేందుకు ఇదొక మార్గం చూపుతుందని అన్నారు. అణగారిన వర్గాలకు క్షేత్రస్థాయిలో సామాజిక, ఆర్థిక ప్రయోజనాలను చేకూర్చడానికి ఈ సర్వే మరింతగా ఉపకరిస్తుందని అన్నారు. దేశంలో పూర్తి స్థాయిలో కులగణన చేపడుతున్న తొలిరాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని ఆయన తెలిపారు. కుల గణన ప్రక్రియలో వ్యక్తులు తమ వివరాలను స్వచ్ఛందంగానే వెల్లడించాల్సి ఉంటుందని, ఎవరినీ బలవంత పెట్టే పరిస్థితి ఉండదని తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రాలు గానీ, ఇతర ఆధారాలు గానీ సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కులగణనకు ప్రతీఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

డెంకాడ పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించిన అంగన్వాడీలు

నిర్బంధాలు, అరెస్టులపై అంగన్వాడీల ఆగ్రహం

- పలుచోట్ల రాస్తారోకోలు
- విజయనగరంలో మోకాళ్లపై సంకెళ్లతో నిరసన
- అరెస్టులపై ధ్వజమెత్తిన కార్మిక, విద్యార్థి, మహిళా సంఘాలు
- తొలగింపు ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని కోటి సంతకాలతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వద్ద మొరపెట్టుకునేందుకు విజయవాడ బయలుదేరిన అంగన్వాడీ కార్యకర్తలను ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టులు చేసి నిర్బంధించడాన్ని నిరసిస్తూ అంగన్వాడీలంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ జిల్లా వ్యాప్తంగా సోమవారం రాస్తారోకోలు చేశారు. కలెక్టరేట్ వద్ద సిఐటియు, ఇఫ్టూ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేతులకు సంకెళ్లతో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక ,ప్రజాసంఘాల నాయకులు రెడ్డి శంకర్రావు, ఎ.జగన్మోహన్, బి.సుధారాణి, పి.రామ్మోహన్, పి. రమణమ్మ, బి.రమణ, అప్పలసూరి మాట్లాడారు. 42 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలను పరిష్కరించకుండా, అత్యంత దుర్మార్గంగా విజయవాడ వెళ్లనివ్వకుండా నిర్బంధించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మరోవైపు కలెక్టర్ విధులకు హాజరు కాకపోతే తొలగిస్తున్నామని ప్రకటించడం దుర్మార్గమని, వెంటనే ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింప చేయకపోతే కార్మిక, ప్రజా,విద్యార్థి, మహిళ, ప్రజా సంఘాలను రాజకీయ పార్టీలను కలుపుకొని రాష్ట్రాన్ని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు హరీష్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

.డెంకాడ : భోగాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో డెంకాడ, భోగాపురం మండలాల నుంచి విజయవాడ బయలుదేరిన అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు ఆదివారం రాత్రి 2గంటలకు అదుపులోకి తీసుకున్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో అదుపులోకి తీసుకున్న వీరిని డెంకాడ స్టేషన్ వద్దకు తీసుకొచ్చారు. సోమవారం ఉదయం దీరంతా స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు.

కొత్తవలస : ప్రభుత్వం మొండివైఖరి వీడాలని కొత్తవలస జంక్షన్, పోలీస్‌స్టేషన్ వద్ద సోమవారం అంగన్వాడీలు రాస్తారోకో చేపట్టారు. వీరికి సిపిఎం నాయకులు జి.అప్పారావు, సిహెచ్ జగన్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : అంగన్వాడీల అక్రమ అరెస్టులకు నిరసనగా పట్టణంలోని దేవి కూడలిలో అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు. తొలుత పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్సు వరకు ర్యాలీ చేపట్టారు. సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, జిల్లా కమిటీ సభ్యులు చెలికాని ముత్యాలు గిరిజన సంఘం డివిజన్ నాయకులు జె.గౌరీష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు డి.జయలక్ష్మి, దంతేశ్వరి, కె.సుశీల పాల్గొన్నారు.

గజపతినగరం : అంగన్వాడీల అరెస్టులను నిరసిస్తూ స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో రాస్తారోకో చేపట్టారు. తొలుత ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు సుభాషిణి, సెక్టార్ లీడర్లు దమయంతి, రాములమ్మ, రమణమ్మ, నాగమణి, వాణి, త్రివేణి, జ్యోతి, సన్యాసమ్మ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

అంగన్వాడీలకు యుటిఎఫ్ చేయూత

జామి : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని 42 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు యుటిఎఫ్ మండల శాఖ చేయూత అందించింది. రూ.10,500 పోరాటనిధిని అంగన్వాడీ కార్యకర్తలకు అందజేసింది. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, జామి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వాసుదేవరావు, ఎం,తాతంనాయుడు, నాయకులు ఎ.రాము, మురళి పాల్గొన్నారు.

అంగన్వాడీల తొలగింపు అన్యాయం

జనసేన నాయకులు గురాన

వైసిపి ప్రభుత్వం అంగన్వాడీలను విధుల నుంచి తొలగింపు ప్రక్రియకు శ్రీకారం చుట్టడం అన్యాయమని జనసేన నాయకులు గురాన అయ్యలు మండిపడ్డారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అంగన్వాడీల తొలగింపు ఉత్తర్వులను ఖండించారు. సిఎం జగన్ నియంతృత్వ పోకడలకు అద్దంపడుతోందని విమర్శించారు. 42 రోజుల నుంచి సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల పట్ల ప్రభుత్వ వైఖరి అప్రజాస్వామికంగా ఉందని ఆయన మండిపడ్డారు. అంగన్‌వాడీలకు అండగా ఉంటామన్నారు. అంగన్వాడీల కన్నీటిలో వైసీపీ ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని అన్నారు.

గజపతినగరంలో నాలుగు రోడ్ల కూడలిలో రాస్తారోకో చేస్తున్న అంగన్వాడీలు

కొత్తవలసలో రాస్తారోకో నిర్వహిస్తున్న అంగన్వాడీలు

విజయవాడలో అరెస్టు చేసి గోపాలపురంలో ఉంచిన అంగన్వాడీలు

అడుగడుగునా నిర్బంధం

- అర్ధరాత్రి 4 బస్సులు అడ్డగింత
- రాత్రంతా ప్రతిఘటన

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో అంగన్‌వాడీలపై ప్రభుత్వం అడుగడుగునా నిర్బంధం ప్రయోగించింది. రిలే నిరాహార దీక్షల నేపథ్యంలో 'జగనన్నకు చెబుదాం' అంటూ చలో విజయవాడకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లా నుంచి ఆదివారం రాత్రి నాలుగు బస్సులు బయలు దేరాయి. దీనికి ముందే అంగన్‌వాడీల నిరసన కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తున్న నాయకుల ఇళ్లను పోలీసులు మఫ్టీలో చుట్టుముట్టారు. ఫోన్లు కూడా ట్రాప్ చేసినట్టు సమాచారం. పోలీసుల దుశ్చర్యలను ముందుగానే గమనించిన అంగన్‌వాడీ నాయకులు, కార్యకర్తలు కొందరు తమ బంధువులు, స్నేహితులు ఇళ్లకు చేరుకుని వివిధ ప్రాంతాల్లో బస్సులు ఎక్కుతూ విజయవాడకు బయలుదేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు రాష్ట్ర కేంద్రానికి సమాచారం అందించడంతో ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని విశాఖపట్నం, ఉభయగోదావరి జిల్లాల పోలీసులను ఉసుగొల్పారు. వారంతా ఎక్కడికక్కడ బస్సులు ఆపుతూ విజయనగరం నుంచి బయలుదేరిన బస్సులను నక్కపల్లి, తుని, రాజమండ్రి, ఏలూరు ప్రాంతాల్లో అడ్డుకున్నారు. డ్రైవర్లను బెదిరించి మరీ వెనక్కితీసుకొచ్చారు. ఈ సందర్భంగా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. తమ సమస్యలు చెప్పుకునేందుకు వెళ్తుంటే అడ్డుకోవడమేమిటంటూ అంగన్‌వాడీలు ఆగ్రహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అడ్డుకోవాల్సి వస్తుందంటూ పోలీసులు అసలు గుట్టు విప్పారు. బస్సులో కాకుండా, రైళ్లు, ఇతర ప్రైవేటు వాహనాల్లో వెళ్లినవారు మాత్రం సోమవారం తెల్లవారుజామునకే విజయవాడ చేరుకుని ఆందోళనా కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలీసులు అటకాయించిన బస్సుల్లోని ఒకటి డెంకాడ పోలీస్ స్టేషన్‌కు తీసుకురావడమే కాకుండా, ఇక విజయవాడ వెళ్లబోమంటూ అంగన్‌వాడీలనుంచి లిఖిత పూర్వక పూచీకత్తులు ఇవ్వాలని పోలీసులు ఒత్తిడి చేశారు. దీన్ని ప్రతిఘటిస్తూ అంగన్‌వాడీలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

విజయవాడలో అంగన్వాడీల అరెస్టు

బొబ్బిలి : నియోజకవర్గం నుంచి చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లిన అంగన్వాడీలను సోమవారం అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి ర్యాలీకి సిద్ధమవుతుండగా, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, రోజా, అనురాధ, నిర్మల, లక్ష్మి, తదితరులను అరెస్టు చేసి, ప్రత్యేక వాహనంలో తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్లో నిర్బంధించారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరితే అక్రమ అరెస్టులు చేసి నిర్బంధించడం దుర్మార్గమని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంబరానికి వేళాయె

- నేడు శంబర సిరిమానోత్సవం
- 650 మంది పోలీసులతో బందోబస్తు
- 170 ఆర్‌టిసి బస్సులు

ప్రజాశక్తి - మక్కువ

సిద్ధమైన సిరిమాను

రాష్ట్ర గిరిజన దేవత జాతరగా గుర్తింపు పొందిన శంబర పోలమాంబ అమ్మవారి సినిమానోత్సవం మంగళవారం జరగనుంది. మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమయ్యే సినిమానోత్సవానికి ఎస్‌పి విక్రాంత్ పాటిల్ పర్యవేక్షణలో సుమారు 650 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ ఇఒ వివి సూర్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు. సాలూరు, పార్వతీపురం, విజయనగరం, పాలకొండ ఆర్‌టిసి డిపోల నుంచి సుమారు 170 బస్సులు ప్రత్యేకంగా శంబరకు నడపనున్నారు. ఇందుకోసం వనంగుడి వద్ద సాలూరు వైపు నుండే వచ్చేబస్సులను, జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద మక్కువ వైపు నుండి వచ్చే బస్సులను నిలపనున్నారు.

నిఘా నీడలో శంబర

సినిమానోత్సం నేపథ్యంలో పటిష్ట నిఘాను ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో తమ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. డ్రోన్, సీసీ కెమెరాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. అసాంఘిక శక్తులకు, అల్లర్లకు ఎలాంటి ఆస్కారం లేకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. క్రైమ్ టీం, షీ టీంలతో పాటు మఫ్టీలో పోలీసులు విధులు నిర్వహిస్తారన్నారు. మక్కువ ప్రధాన రహదారి జంక్షన్ నుంచి ట్రాఫిక్‌ను రెండు విధాలా మళ్లిస్తున్నట్టు తెలిపారు. చెముడు మీదుగా మూడు, నాలుగు చక్రాల వాహనాలకు, , కవిరపల్లి మీదుగా ద్విచక్ర వాహనాలకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. సిరిమాను ఊరేగింపు సమయంలో రోప్ పార్టీ బందోబస్తు ఉంటుందన్నారు. మూడుచోట్ల ప్రత్యేక పోలీసులను ఏర్పాటు చేశామన్నారు. జాతర సందర్భంగా గ్రామంలోని అమ్మవారి ఆలయాల వద్ద ఎటువంటి ఆటంకం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరాకు ఆ శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది.

కాంగ్రెస్‌లో జవసత్వాలు

- నేడు పిసిసి అధ్యక్షులు షర్మిల రాక
- వైసిపిలో గుబులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో పార్టీలో జవసత్వాలు నింపేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. అందులో భాగంగానే ఎన్నికల సన్నద్ధత కోసం పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల మంగళవారం జిల్లాకు రానున్నారు. మధ్యాహ్నం 3గంటలకు విజయనగరంలోని క్షత్రియ కల్యాణమండపంలో పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశం కానున్నారు. పార్టీ కేడర్‌ను ఎన్నికలకు సన్నద్ధం చేయనున్నారు. ప్రస్తుత అధికారంలోకి ఉన్న వైసిపిలో నాటి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే 99శాతం మంది ఉన్నారు. ఈనేపథ్యంలో పార్టీలో అసంతృప్తి, వ్యతిరేకత ఉన్నవారిని కాంగ్రెస్‌లోకి లాగేందుకు యత్నిస్తున్నట్టుగా తెలుస్తోంది. షర్మిల రోజుకు మూడు జిల్లాల చొప్పున పర్యటించేందుకు షెడ్యూలు ప్రకటించిన సంగతి తెలిసిందే. శ్రీకాకుళం నుంచి ఈ పర్యటనకు శ్రీకారం చుట్టారు. ఈ సమావేశంలో నాయకులకు ఆమె దిశా నిర్దేశం చేయనున్నారు. ఆమె తొలి పర్యటన ముగిశాక జిల్లా నుంచి కొన్ని చేరికలు ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా వైసిపిలో టిక్కెట్ ఆశించి, భంగపడినవారు కాంగ్రెస్ తరపున పోటీ చేసేందుకు సిద్ధపడవచ్చనే భావన చాలా మంది నోట వినిపిస్తోంది. ఒక వేళ కాంగ్రెస్ బలపడితే ఆ ప్రభావం టిడిపి, జనసేన పార్టీలకన్నా వైసిపిపైనే ప్రభావం ఎక్కువగా ఉంటుందని పలువురు అంచనా వేస్తున్నారు. ఎన్నికల్లో వైసిపి ఓట్లు ఎంతమేర చీలినా, ఆ మేరకు వైసిపికే నష్టం జరుగుతుందని కూడా చర్చనడుస్తోంది. ఈ నేపథ్యంలో షర్మిల పర్యటన జిల్లాలో ఆసక్తికర పరిణామంగా మారింది.

షర్మిల పర్యటనను జయప్రదంచేయండి

విజయనగరం కోట : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలుగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ షర్మిల తొలిసారిగా మంగళవారం జిల్లాకు రానున్నారని పార్టీ జిల్లా అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షత్రియ కళ్యాణ మండపంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో జరిగే సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. రానున్న కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు చేపట్టనున్న కార్యాచరణను తెలియజేస్తారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డోల శ్రీనివాస్, నగర పార్టీ అధ్యక్షులు సుంకరి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో నాయకత్వ లోపం

జిల్లా కాంగ్రెస్‌లో నాయకత్వ లోపం ఉందని పలువురు నాయకులు లోలోపల మదన పడుతున్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ తీరుపై స్థానిక నాయకులు బాహాటంగా తిరుగు బాటుకు సిద్ధం అవుతున్నారు. జిల్లాలో గత కొంత కాలంగా లోలోపల పార్టీ నాయకుల మధ్య అధికారం కోసం కుమ్ములాటలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న నాయకులను ఏకతాటి పైకి తీసుకు రావడంలో అధ్యక్షుడు విఫలమయ్యారన్న చర్చ జరుగుతోంది. పదవి చేపట్టిన నాటి నుంచి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ జిల్లా, పట్టణ నాయకులు ఆయనపై మండి పడుతున్నారు. ఎవరినీ పట్టించుకోకుండా తన నచ్చినప్పుడు సమావేశాలు పెడుతున్నారని విమర్శిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పార్టీకి ఇబ్బందని అంటున్నారు. నూతన పిసిసి అధ్యక్షులు షర్మిల రాక తోనైనా తీరుమారేనా, లేక తాను మారేనా! అంటూ నాయకులు వాపోతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి మయూర్ అశోక్

జిల్లాలో ఓటర్ల సంఖ్య

15,41,001

మహిళా ఓటర్లే అధికం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో ఓటర్ల సంఖ్య 15,41,001గా అధికారులు ప్రకటించారు. వీరిలో పురుష ఓటర్లు 7,60,400, మహిళా ఓటర్ల సంఖ్య 7,80,518 కాగా ఇతరులు 83 మంది ఉన్నారు. పురుషలతో పోలిస్తే మహిళా ఓటర్ల సంఖ్యే అధికంగా ఉంది. గత ఏడాది అక్టోబరు 27న ప్రకటించిన ముసాయిదా జాబితాలో ఓటర్ల సంఖ్య 15,17,365 కాగా, ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 23,636 పెరిగింది. జిల్లాలో తుది ఓటర్ల జాబితా వివరాలను జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సోమవారం తన ఛాంబర్‌లో విడుదల చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఓటర్ల జాబితా సీడిలను అందజేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తి అయ్యిందని, తుది జాబితాను విడుదల చేస్తున్నామని చెప్పారు. అక్టోబరులో విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాతో పోలిస్తే ప్రస్తుతం పురుష ఓటర్ల సంఖ్య 10,344, మహిళా ఓటర్ల సంఖ్య 13,311 పెరగగా, ఇతర ఓటర్ల సంఖ్య 19 తగ్గిందని, మొత్తంమీద ఓటర్ల సంఖ్య 23,636 పెరిగిందని వివరించారు. ముఖ్యంగా జిల్లాలో యువ ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. తుది జాబితా ప్రకటించిన తరువాత జాబితాలో తొలగింపులు ఉండబోవని, చేర్పులు మాత్రం నామినేషన్ల గడువుకు ముందు 10 రోజులు వరకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటుహక్కు వినియోగంపై విస్తత అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. దీనిలో భాగంగా ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం రోజున పలు కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. నిబంధనల ప్రకారం వృద్ధులకు ఇంటినుంచే ఓటు వేసుకొనే అవకాశం ఉందని, దానికోసం ముందుగానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని జెసి తెలిపారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎస్.డి.అనిత, ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ శ్రీకాంత్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాంకు 311 వినతులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

అర్జీదారులతో మాట్లాడుతున్న డిఆర్‌ఒ అనిత

జగనన్నకు చెబుదాంలో ప్రజల నుంచి వివిధ ప్రభుత్వ శాఖలకు వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.డి.అనిత జిల్లా అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు వెంకటేశ్వరరావు, సుదర్శనదొర, సుమబాల తదితరులతో కలసి వినతులు స్వీకరించారు. పలు సమస్యలపై 311 వినతులు వచ్చాయి. అత్యధికంగా రెవిన్యూ సమస్యలపై 255 వినతులు వచ్చాయి.

కొరిగి, పూంసే పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 19,20,21 తేదీల్లో రాజస్థాన్ రాష్ట్రం సవాయి మాదాపూర్‌లో జరిగిన 40వ జూనియర్, 39వ సీనియర్ (కొరిగి) జాతీయ స్థాయి పోటీల్లో మన రాష్ట్ర క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబరిచి మన రాష్ట్రానికి కొరిగి విభాగంలో 6 బంగారు పతకాలు, 5 రజత పతకాలు, 5 కాంస్య పతకాలు సాధించారు. జూనియర్ ఓవరాల్ ఛాంపియన్ షిప్ 3 వ ట్రోఫీ, సీనియర్ ఓవరాల్ ఛాంపియన్ షిప్ 1 వ ట్రోఫీ అందుకున్నారు. పూంసే విభాగంలో 6 బంగారు పతకాలు, 4 రజత పతకాలు, 8 కాంస్య పతకాలు సాధించి జూనియర్ ఓవరాల్ పూంసే ఛాంపియన్ షిప్ 2వ ట్రోఫీ అందుకున్నారు. ఇంతటి విజయానికి కారణమైన క్రీడాకారులకు, కోచ్‌లకు తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులుపి.అచ్చుతారెడ్డి, కార్యదర్శి సి.వేణుగోపాల్‌రావు తెలిపారు.

ఎస్ఎస్ఒఎస్ఇఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



సమగ్ర శిక్ష అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా నూతన కమిటీ సభ్యులు

ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ - జెఎసి సమావేశం ప్రజా సంఘాల కార్యాలయంలో ఆర్ శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. జెఎసి జిల్లా సమావేశానికి పర్యవేక్షకులుగా రాష్ట్ర అధ్యక్షులు బి. కాంతారావు (నాని) జిల్లా గౌరవ అధ్యక్షులు జి అప్పలసూరి హాజరయ్యారు. 22 రోజుల సమ్మె, అనుభవాలు, లోపాలు, భవిష్యత్తు కార్యచరణ గురించి చర్చించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మన ఐక్యతను కొనసాగిస్తూ రాష్ట్ర జెఎసి నాయకత్వానికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ఐక్యతను మరోసారి చాటి చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చర్యలు తీసుకోవాలని, జీతాలు పెంపు జీవో విడుదల చేయాలని కోరుతూ తీర్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కె.గురువులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.రవీంద్రబాబు, ఉపాధ్యక్షులుగా పి.తేజేశ్వరి, ఎన్.పద్మ, పి.రాంబాబు, డి.జయగణేశ్, ప్రధాన కార్యదర్శిగా రమాదేవి , అడిషనల్ జనరల్ సెక్రటరీగా ఆర్ శ్రీనివాసరావు, జాయింట్ కార్యదర్శులుగా డి. నరసింహం, బి.నారాయణమూర్తి, టి.చిన్నతల్లి, వంశీకృష్ణ, ఎం.రాజు, కోశాధికారి (ట్రెజరర్)గా వి.సింహాచలం ఎన్నికయ్యారు.

ఎడ్లబండ్ల పోటీలను ప్రారంభిస్తున్న కెబిఎ రాంప్రసాద్

హోరాహోరీగా కబడ్డీ, ఎడ్లబండ్ల పోటీలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని అరిగిపాలెంలో చుక్కమాంబ జాతర సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. విజేతలకు నగదు బహుమతులను సర్పంచ్, ఎంపిటిసి, ఉత్సవ కమిటీ సభ్యులు అందజేశారు. మండలంలోని రాయుడుపేట గ్రామంలో బంగారమ్మతల్లి జాతర సందర్భంగా ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కెబిఎ రాంప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధానకార్యదర్శి కె.రమణమూర్తి, ఉపాధ్యక్షులు పి.రమణ, మాజీ ఎంపిటిసి జగ్గుబాబు, సర్పంచ్ సేనాపతి లీల, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన సోమవారం వ్యవసాయ శాఖ, వై ఎస్ఆర్ క్రాంతి పథం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎఒ ఎం. పూర్ణిమ, ఎపిఎం ఎల్.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను ప్రదర్శన రూపంలో విక్రయిస్తున్నామన్నారు. ఈ పద్ధతిలో పండించిన ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఎ ఎం.నాగరాజు, చీపురుపల్లి సబ్ డివిజన్ ప్రకృతి వ్యవసాయ, మాస్టర్ ట్రైనర్ సత్యనారాయణ, ఎఫ్‌పిఒ ఎపిఎం గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ స్ఫూర్తితో పోరాటాలు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

లెనిన్ స్ఫూర్తిగా పోరాటాలు చేయాలని సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు అన్నారు. సోమవారం స్థానిక విద్యుత్ జిల్లా స్టోర్స్ వద్ద హమాలీ సంఘం ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు లెనిన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మిక, కర్షక, పీడిత వర్గాల విముక్తికై కమ్యూనిస్ట్ సిద్ధాంతాల ద్వారా మార్గం చూపిన వ్యక్తి లెనిన్ అని కొనియాడారు. పెట్టుబడి దారుల దోపిడీ ఎండగట్టి విప్లవాన్ని తీసుకువచ్చా రన్నారు. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలతో పెట్టు బడిదార్లకు నిద్ర లేకుండా చేసి సోషలిస్టు విప్లవం తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు పతివాడ లక్ష్మణ రావు, కలిశెట్టి శ్రీను, మీసాల లెనిన్, కెల్ల గోవింద రావు తదితరులు పాల్గొన్నారు.

'టిడిపితోనే అభివృద్ధి'

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యమని విజయనగరం నియోజకవర్గ ఇంచార్జ్ అతిధి గజపతి అన్నారు. సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ధరల పెరుగుదల ఆర్టీసీ చార్జీల బాదుడు తప్ప ఒరిగిందేమి లేదని అన్నారు. చెత్తపై పన్ను వేసిన చెత్త ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. టిడిపి హయాంలో పైసా కూడా కరెంట్ ఛార్జీలు పెంచలేదు కానీ ఈ ప్రభుత్వం వచ్చాక అనేకసార్లు కరెంట్ ఛార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచారని తెలిపారు. జగన్ వచ్చాక బీసీలకు రూపాయి ఖర్చు పెట్టారా? అని ప్రశ్నించారు. అందుకే రాబోయే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రి చేసేందుకు ప్రజలంతా సిద్ధం కావాలని కోరారు.

552 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి గ్రామంలో ఈఐడి ప్యారి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సోమవారం మెగా ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో విజయవాడకు చెందిన ఫ్రీ ఐ కేర్ ఆప్తాల్మిక్ వైద్యులు కృష్ణమూర్తి బృందం 552 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించారు. వీరిలో 325 మందికి మందులు, కళ్ళ జోళ్లను సీనియర్ ఎవిపి పట్టాభి రామిరెడ్డి, హెచ్‌ఆర్ హెడ్ మురళీకృష్ణ, సర్పంచ్ పట్టాభి, ఎంపిటిసి సంధ్యా శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంకిలి ప్యారి షుగర్ పరిధి చుట్టు పక్కల గ్రామ ప్రజలకు వైద్య సేవలు, కళ్ళజోళ్ళ పంపిణీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా అందిస్తున్నామన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలను యాజమాన్యం మరిన్ని చేపట్టాలని విజయనగరం జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నారు జనార్దన్‌రావు కోరారు. ఈ కార్యక్రమంలో షుగర్ సిబ్బంది స్వామి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు

ప్రజాశక్తి-బొబ్బిలి

నియోజకవర్గంలో అర్హులందరికీ ఓటుహక్కు కల్పించినట్లు ఆర్‌డిఒ ఎ.సాయిశ్రీ తెలిపారు. సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. అనంతరం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో 8306 ఓట్లపై ఫిర్యాదులు అందగా, సమగ్ర దర్యాప్తు చేసి తప్పులు లేకుండా ఓటర్ల జాబితా తయారు చేసినట్లు చెప్పారు. 570 మంది గిరిజనులకు ఓటు హక్కు కల్పించామని తెలిపారు. నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాల్లో పురుష ఓటర్లు 1,13,027, మహిళా ఓటర్లు 1,15,791, ట్రాన్స్ జెండర్ 11 మంది ఉన్నట్లు చెప్పారు. సమావేశంలో తహశీల్దార్ డోల రాజేశ్వరరావు, ఎన్నికల డిటి గౌరీశంకర్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా ఇప్పించండి

ప్రజాశక్తి-బొబ్బిలి

తన భర్త మరణించి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకూ వైఎస్ఆర్ బీమా అందలేదని మున్సిపాలిటీకి చెందిన పేద మహిళ బొంగు పద్మ.. ఆర్‌డిఒ సాయిశ్రీ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త కంటే వెనుక మరణించిన వారికి బీమా వచ్చిందని, తనకు బీమా ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. దర్యాప్తు చేసి న్యాయం చేస్తామని ఆర్‌డిఒ హామీ ఇచ్చారు.

ఓటర్ల జాబితా విడుదల

బొండపల్లి : మండలంలో 52 పోలింగ్ బూత్‌లకు సంబంధించి కొత్త ఓటర్ల జాబితాను సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ డిఎంజిఎస్ ప్రసాదరావు విడుదల చేశారు. మండలంలో 20,417 మహిళా ఓటర్లు, 19,649 పురుష ఓటర్లు ఉన్నారు. ఒకరు థర్డ్ జెండర్. మొత్తం 40,067 ఓటర్లు ఉన్నారని తహశీల్దార్ తెలిపారు.

సామాజిక సమతుల్యతకే కులగణన

ప్రజాశక్తి-రామభద్రపురం

సామాజిక సమతుల్యతకే కులగణన చేస్తున్నట్లు ఎంపిడిఒ రమామణి తెలిపారు. సోమవారం స్థానిక దళితవీధిలో చేపడుతున్న కులగణన సర్వేను ఎంపిడిఒ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కులగణనకు ప్రతిఒక్కరూ సహకరించి గడువులోగా పూర్తి సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు.

శంబర జాతరకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

మంగళవారం జరుగనున్న శంబర పోలమాంబ జాతరకు విజయనగరం ఎపిఎస్ఆర్‌టిసి నుంచి 40 ప్రత్యేక బస్‌లను వేసినట్లు ఆర్‌టిసి జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్.అప్పలనారాయణ తెలిపారు. బొబ్బిలి నుండి డిబ్బగుడ్డివలస మీదుగా శంబర కు 20 బస్సులు, గజపతినగరం, సాలూరు మీదుగా 20 బస్సులు నడపనున్నట్లు తెలిపారు.

భూగర్భ జలాలను పరిరక్షించాలి : జెసి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో భూగర్భ జలాల పరిరక్షణకు గ్రామ స్థాయిలో ప్రణాళికలు రూపొందించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సూచించారు. జిల్లాలో ప్రస్తుతం భూగర్భ జలాల పరిస్థితి సంతృప్తి కరంగా, అతితక్కువ లోతులోనే అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అయినప్పటికీ భవిష్యత్తులో ఇబ్బంది రాకుండా ఇప్పటినుంచే చర్యలు చేపట్టడం మంచిదని సూచించారు. భూగర్భ జల అంచనా 2022-23 వివరాలను, సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో వెల్లడించారు. భూగర్భ జలాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు. భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ, భూగర్భ జల అంచనా 2022-23 ముఖ్య అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో కురిసే సగటు వర్షపాతంలో సుమారు 9 శాతం వరకు భూగర్భ జలంగా మారుతుందని తెలిపారు. జిల్లాలో సుమారు 1132 వాగులు, గెడ్డలు, నదులు తదితర నీటి ప్రవాహాలు ఉన్నాయని, వీటి ద్వారా కూడా నీరు భూగర్భ జలంగా మారుతోందని చెప్పారు. గృహ, వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలకు భూగర్భ జలాల వినియోగాన్ని వివరించారు. పూసపాటిరేగ మండలంలో పారిశ్రామిక వినియోగం ఎక్కువగా ఉందన్నారు. రీఛార్జ్ కంటే నీటి వినియోగం ఎక్కువగా ఉన్నచోట ఎటువంటి నీటి పథకాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. నీటి లభ్యతలో మన జిల్లా రాష్ట్రంలో ఐదో స్థానంలో, డ్రాఫ్ట్‌లో 12వ స్థానంలో ఉందన్నారు. జిల్లాలోని మెరకముడిదాం మండలంలో నీటి లభ్యత ఎక్కువగా, పూసపాటిరేగ మండలం వినియోగంలో మొదటి స్థానంలో ఉన్నాయని చెప్పారు. రైతులకు అవగాహన కల్పించి, పంటల సాగును మార్చడం ద్వారా కూడా కొంత వరకు భూగర్భ జలాలను పరిరక్షించవచ్చునని సూచించారు. వర్షాలు కురుస్తున్నప్పుడే నీటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. సమావేశంలో సిపిఒ

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

పి.బాలాజీ, జిల్లా వ్యవసాయాధికారి తారక రామారావు, పశు సంవర్ధక అధికారి డాక్టర్ విశ్వేశ్వరరావు, మత్స్యశాఖాధికారి నిర్మలాకుమారి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమాశంకర్, డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, డిఆర్ డిఎ ఎపిడి సావిత్రి, ఉద్యానశాఖ డిడి జమదగ్ని, పరిశ్రమలశాఖ జిఎం పాపారావు, డిఎల్‌డిఒలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంకండి

ఎమ్మెల్యేలు బొత్స, కడుబండి, శంబంగి

ప్రజాశక్తి - జామి

ఎన్నికలకు వైసిపి శ్రేణులు సిద్ధం కావాలని ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, కడుబండి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని కుమరాంలో ప్రయివేటు కళ్యాణ మండపంలో వైసిపి మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. తొలుత నూతనంగా ఏర్పడిన మండల, యువజన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ 27న భీమిలిలో జరిగే ఎన్నికల శంఖారావం సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. టిడిపి కుయుక్తులను తిప్పికొట్టాలన్నారు. ఆసరా కార్యక్రమాలు పండగ వాతావరణంలో చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సబ్బవరపు అరుణ, జెడ్‌పిటిసి సరయు, బ్యూటిఫికేసన్ రాష్ట్ర డైరెక్టర్ సత్యారావు, డిసిసిబి డైరెక్టర్ పి.సంజీవురావు, మండల ప్రచార కమిటీ అధ్యక్షులు సీనియర్ నాయకులు గుడివాడ రాజేశ్వరరావు, వైస్ ఎంపిపి జి.వెంకటరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

బాడంగి : భీమిలిలో జరిగే వైసిపి ఉత్తరాంధ్ర స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కోరారు. బాడంగిలో సోమవారం ఏర్పాటుచేసిన వైసిపి సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి బాడంగి మండల బాధ్యతలను శంబంగి శ్రీకాంత్‌కు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. ఇక నుంచి తమ కుటుంబ సభ్యులు నాలుగు మండలాలకు బాధ్యతలు వహిస్తారని వెల్లడించారు. కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటారని తెలిపారు.

సొంత పార్టీ నాయకుల నుంచే దుష్ప్రచారమా?

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆవేదన

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-వేపాడ

సొంత పార్టీ నాయకులు కొంతమంది తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, వారితీరు తీవ్ర బాధను కలిగిస్తోందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తంచేశారు. వేపాడలో ప్రయివేటు కళ్యాణ మండపంలో సోమవారం వైసిపి నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను అవినీతికి పాల్పడుతున్నట్లు స్వపక్ష నాయకులే వార్తలు రాయించారంటూ విచారం వ్యక్తం చేశారు. ఏదేమైనా జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ సిఎంను చేయడమే లక్ష్యంగా ముందుసాగాలని కోరారు. జగనే మళ్లీ సిఎం అయితే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని చెప్పారు. 27న భీమిలిలో జరిగే బహిరంగ సభకు తరలిరావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా కెజిపూడి గ్రామానికి చెందిన రైతు.. తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆయన స్పందిస్తూ సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. సమావేశంలో ఎంపిపి సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, డిసిసిబి చైర్మన్ వి.చినరామునాయుడు, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం.కస్తూరి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు ఎన్.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

రానున్నది టిడిపి-జనసేన ప్రభుత్వమే : నాగార్జున

ప్రజాశక్తి - గుర్ల

వచ్చే అసంబ్లీ ఎన్నికలలో విజయం సాధించి టిడిపి- జనసేన ప్రభుత్వం స్థాపించడం తథ్యమని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. ఆదివారం రాత్రి మండలంలో తాతావారి కిట్టలి గ్రామం నుంచి పలు కుటుంబాలు వైసిపిని వీడి నాగార్జున సమక్షంలో టిడిపిలో చేరాయి. వీరందరికీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. టిడిపి మండల అధ్యక్షులు చనమల్ల మహేశ్వరరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో నాగార్జున మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయమే లక్ష్యంగా పని చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో వార్డు మెంబర్లు రాగోలు గౌరి నాయుడు, ఇజ్జురోతు రమణ, పాంద్రంకి సూర్యకాంతం, గడి సూరినాయుడు, మామిడి మాలచ్చమ్మ, రెడ్డి లక్ష్మనాయుడు, మామిడి సాంబ, రాగోలు సీతంనాయుడు, రాగోలు లక్ష్మనాయుడు, రాగోలు అప్పలనాయుడు, రాగోలు సత్యం, పాంద్రంకి లక్ష్మ నాయుడు, గడి రామ్మూర్తి, ఇజ్జురోతు సత్తిరాము, గేదెల గౌరి నాయుడు తదితర 100 కుటుంబాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెన్నె సన్యాసినాయుడు, తిరుమలరాజు కిరణ్ కుమార్‌రాజు, చనమల మహేశ్వర రావు, మామిడి సూర్యారావు, పిళ్ళా అప్పలనాయుడు, సంచాన సన్యాసి నాయుడు, కర్రోతు గోవింద, గొర్లె రామునాయుడు, మండల అప్పల నాయుడు, శ్రీను, సూర్యారావు, నారాయణరావు, పైడినాయుడు, దాసరి శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు కిమిడి నాగార్జున

అంగన్వాడీలకు అన్యాయం

చీపురుపల్లి : హక్కుల కోసం రోడ్డెక్కిన అంగన్వాడీలకు కనీసం న్యాయం కూడా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేయడం లేదని విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. జగన్మోహన్ రెడ్డి అనే వ్యక్తి ముఖ్యమంత్రిగా నాలుగేళ్ల తొమ్మిది నెలల కాలంలో అనేక రకాలుగా విఫలమయ్యారని విమర్శించారు. సోమవారం చీపురుపల్లిలో ఆయన తన నివాసంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. జగన్‌పాలనా సమయంలో ఒక ముఖ్యమంత్రిగా ఉపాధి అవకాశాలు గానీ, అభివృద్ధి గానీ చేశారా అని ప్రశ్నించారు సంక్షేమ పథకాలంటూ వంద రూపాయలు మన చేతికి ఇచ్చి, తిరిగి 200 రూపాయల లాక్కుంటున్నారని ఆరోపించారు. గతంలో తెలుగుదేశం పార్టీ హయాంలో సంక్రాంతి, క్రిస్మస్ కానుకలు, రంజాన్ తోఫా ఇచ్చేవారని.. నేడు అవన్నీ ఏమయ్యాయని అని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తామని హామీ ఇచ్చిన జగన్.. ఈరోజు నిషేధం కాదు కదా, మద్యం ధరలను మూడు, నాలుగింతలు పెంచారని తెలిపారు. దీనికి తోడు నకిలీ మద్యం ఇస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చాక ఏడు సార్లు విద్యుత్తు బిల్లులు పెంచారని తెలిపారు.

జిల్లాలోని తోటపల్లి ప్రాజెక్టు మిగులు పనులు పూర్తి చేయలేదని, నిర్వహణ కోసం ఒక రూపాయి కూడా ఖర్చు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. చివరికి ఉద్యోగులను కూడా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. చరిత్రలో జీతాలు తగ్గించిన ముఖ్యమంత్రి, రాజకీయ నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది జగన్ ఒక్కరే అని విమర్శించారుచంద్రబాబు అధికారంలోకి రాగానే ఎస్‌సి, ఎస్‌టి, బిసిల రక్షణ చట్టాలతో పాటు సబ్ ప్లాన్ నిధులు న్యాయంగా ఖర్చు చేస్తారని తెలిపారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్ర

ప్రజాశక్తి- డెంకాడ

మండల స్థాయిలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ముగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. గెలుపొందిన మండల స్థాయి టీములకు ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, డెంకాడ పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనకసింహాచలం చేతులు మీదుగా బహుమతులు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. పిఇటిలను ఘనంగా సన్మానించి వారికి కూడా జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డిడి స్వరూప రాణి, ఇఒపిఆర్‌డి శంకర జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందుకున్న క్రీడాకారులు

సమస్యలు వింటున్న ఎస్‌పి దీపిక

ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం

ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఎస్‌పి ఎం.దీపిక ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వినతులు స్వీకరించారు. బాధితుల సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియోకాన్ఫరెన్సులో మాటాడారు. ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించి విచారణ చేసి వారం రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, విజయనగరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు, డిసిఆర్‌బి సిఐ జె. మురళి, ఎస్‌బి సిఐ కెకె వి.విజయనాథ్, ఎస్‌ఐలు సిద్ధార్థ్, ప్రభావతి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

102 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - లక్కవరపుకోట

సోంపురం జంక్షన్ వద్ద 72 మద్యం సీసాలను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ గోపాలరావు తెలిపారు. వేపాడ మండలం అరిగిపాలెం గ్రామానికి చెందిన కె.సన్యాసిరావు అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు కాపు కాసి పట్టుకున్నట్లు తెలిపారు.

రేగిడి : మండలంలోని కొమిరి గ్రామానికి చెందిన బెల్ట్ షాపు నడుపుతున్న వ్యక్తి వద్ద నుంచి 30 మద్యం బాటిళ్లతో పోలీసులకు సోమవారం పట్టుబడ్డాడు. ఉంగరాడ మెట్ట నుంచి స్వగ్రామానికి అక్రమంగా మద్యం బాటిళ్ల తీసుకువెళ్ళడంతో దాడులు జరిపి పట్టుకున్నారు. అక్రమ మద్యం దారున్ని రేగిడి పోలీస్ స్టేషన్ తీసుకువచ్చారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. బెల్ట్ షాపులపై నిఘా ఉంచామన్నారు.

బిడ్డ మృతదేహాన్ని ఎత్తుకొని రోధిస్తున్న తల్లి సన్యాసమ్మ

చిట్టెంపాడులో మరో గిరిజన బాలుడు మృతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

రహదారి సౌకర్యం లేని మూల బొడ్డవర పంచాయతీ చిట్టెంపాడు గ్రామంలో మరో గిరిజన చిన్నారి కన్నుమూశాడు. జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్న జన్ని ప్రవీణ్ (6నెలలు)ను తల్లిదండ్రులు ఏడు కిలోమీటర్లు కొండ దించి, పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకరోజు వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం విజయనగరంలోని ఘోషాస్పత్రికి పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందాడని బాలుడు తండ్రి సన్యాసిరావు, తల్లి సన్యాసమ్మ తెలిపారు. చిన్నారి మృతదేహాన్ని ప్రైవేటు వాహనంలో బొడ్డవర రైల్వే స్టేషన్ వరకు తీసుకొచ్చి, అక్కడి నుంచి కొండపైకి తీసుకువెళ్లారు, ఈనెల 5న ఇదే గ్రామానికి చెందిన మాదల గంగమ్మను, తన ఆరు నెలల చిన్నారిని విశాఖ తరలించగా, 5వ తేదీన బిడ్డ, 16న తల్లి మృతి చెందిన విషయం తెలిసిందే. వరుస మరణాలతో గ్రామంలో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. వైద్యాధికారులు స్పందించి వైద్యసేవలందించాలని కోరుతున్నారు.

సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-బాడంగి

అందరి సమన్వయంతో మండల అభివృద్ధి కృషి చేయాలని ఎంపిపి బోగి గౌరి, జెడ్‌పిటిసి పి.రామారావు కోరారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల పరిషత్తు సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. మండల అభివృద్ధికి సంబంధించిన 21 అంశాలపై ప్రభుత్వ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన పలు సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. బాడంగి సర్పంచ్ కండి రమేష్ మాట్లాడుతూ దళిత సర్పంచ్‌ని కావడంతో ప్రాధాన్యత ఇవ్వడం లేదని, ప్రోటోకాల్ పాటించడం లేదని ఆగ్రహం చేశారు. రెండేళ్ల నుంచి ఎస్‌సి కాలనీ పాఠశాల శిథిలావస్థకు చేరిందని విన్నవించినా ఏ ఒక్క అధికారీ పట్టించుకోలేదన్నారు. సమావేశంలో ఎంపిడిఒ ఆంజనేయులు, వైస్ ఎంపిపి భాస్కర్‌రావు, రమేష్, నాయకులు తెంటు మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

లెండిలో ఆన్‌లైన్ అధ్యాపక శిక్షణ

ప్రజాశక్తి- డెంకాడ

లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ఆన్‌లైన్ మాధ్యమంలో 'న్యూ ట్రెండ్స్ ఇన్ పవర్ ఎలక్ట్రానిక్స్ ఫర్ మైక్రో గ్రిడ్స్ అండ్ ఎలక్ట్రిక్ వెహికల్స్' అనే అంశం పై 5 రోజుల ఆన్‌లైన్ అధ్యాపక శిక్షణ సోమవారం ప్రారంభించారు. విభాగాధిపతి డాక్టర్ సుబ్బరామయ్య మాట్లాడుతూ పవర్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వెహికల్స్ వల్ల విద్యుత్ రంగంలో పెను మార్పులు రానున్నాయన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ రైల్ రోడ్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ప్రతినిధి డాక్టర్ సల్కోటి సురేందర్ రెడ్డి ఎలక్ట్రిక్ వెహికల్స్ విశిష్టతను తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గాయధర్ పండా, ప్రొఫెసర్ నిట్ మేఘయల, డాక్టర్ ధరవంత్ కిషన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సూరత్కల్ లెండి ప్రిన్సిపాల్ డాక్టర్ వివి రామరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు తమ్మినేని, విభాగాధిపతి డాక్టర్ కె.సుబ్బరామయ్య, డాక్టర్ పరశురాములు బుడుము, డాక్టర్ బివియస్ ఆచార్యులు, డాక్టర్ పి.జానకి, వివిధ ప్రాంతాల, ఇతర కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE, VIZIANAGARAM
I.P.No. 29 /2023

Between :
Sri.Vendigarla Vijaya Kumar S/o. Late Srinu, Hindu, aged about 57 years, resident at Kondav elagada village, Nellimarla Mandalam, Vizianagaram District.
...Petitioner

And :
Sri.Borapu Appala Naidu S/o. Kurmayya, Hindu aged about 58 years cultivation, resident of Kondakarakam village, Vizianagaram District. ......Respondent.

NOTICE

It is here by informed that the above named petitioner filed the above Insolvency petition against the respondent paying that Hon'ble court that to declare him as insolvent. The above I.P. (Insolvency Petition) is posted on **31-1-2024** and you are informed to attend before the Hon'ble court on that day at **10-30 A.M.,** and submit your objections if any in person or through an Advocate. Failing which appropriate legal action will be taken by the Hon'ble court in your absence as per procedure.

K.Shyam Kumar,
Advocate, D.No.14-5-37,
Kamma street, Vizianagaram,
Mobile.No. 8555953882